

# యండమూరి కథాస్రవంతి

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## ఒక గమ్యం.. రెండు దార్లు

జైలర్ రూమ్ విశాలంగా ఉంది. గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఆ నిశ్శబ్దాన్ని గడియార శబ్దం భంగపరుస్తోంది.

జైలర్ ఎదురుగా ఒక యువతి తెల్లని దుస్తుల్లో కూర్చుని ఉంది. సుదీర్ఘమైన ఆలోచనలో ఉన్నట్లు తల దించుకొని చేతి వేళ్ళ వైపు చూసుకుంటూ ఉన్నది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ 'నమస్తే సర్' అన్న శబ్దం బయటి నుంచి వినబడింది.

జైలర్, అతని ఎదురుగా కూర్చున్న యువతి తల తిప్పి అటు చూశారు.

అక్కడ నిలబడి ఉన్నాడు ఆలీ.

"లోపలికి రా" అన్నాడు జైలర్

ఆలీ లోపలికి వచ్చి వారి టేబుల్ పక్కనే చేతులు కట్టుకొని అభావంగా నిలబడ్డాడు.

"మీరు మాట్లాడుకోండి" అంటూ జైలర్ బయటకి వెళ్ళాడు.

ఒక్క క్షణం అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఆమె సన్నటి స్వరంతో "నా భర్త ని ఎందుకు చంపేశావ్?" అని అడిగింది.

అప్పుడు అర్థం అయింది అతడికి... వచ్చినదెవరో.

రెండు సంవత్సరాల క్రితం జడ్జీ అడిగాడు. అయిదు సంవత్సరాల తరువాత ఇప్పుడు ఈమె అడుగుతోంది.

అతడు  సమాధానం అప్పుడూ చెప్పలేదు. ఇప్పుడూ చెప్పలేదు.

ఆమె లేచి నిలబడింది. గొంతులో సుడులు తిరుగుతున్న దుఃఖాన్ని అతి కష్టం మీద ఆపుకుంటూ, "నా భర్తలో ఏ దుర్గుణాలూ లేవు. అందరికీ ఉపయోగపడే మనస్తత్వం. అలాంటి మనిషిని చంపటానికి నీకు మనసెలా వచ్చింది?" అంది.

అతడు తల దించుకొని మాట్లాడలేదు.

"నాకు సమాధానం కావాలి. రేపు నా ఇద్దరు పిల్లలు ఎదిగిన తర్వాత 'మా తండ్రిని ఎందుకు చంపారు? ఎవరు చంపారు?" అని  అడిగితే ఏమి చెప్పాలి? నీకు ఇప్పటికే శిక్ష పడింది.  ఇదేం కోర్టు కాదు. నిజం చెప్పు. హత్య చేసేటంత ద్రోహం నా భర్త ఏం చేశాడు?"

"నాకేమీ తెలియదు. నన్ను నమ్మండి" అంటూ అతను ఏదో చెప్పబోతుండగా జైలర్ వచ్చి, "మీకు ఇచ్చిన టైం అయింది. వెళ్ళమ్మా" అన్నాడు.

"ఇంకొక నిమిషం సార్. జరిగినదేమిటో ఇతను చెప్తున్నాడు. అది తెలుసుకొని వెళ్ళిపోతాను".

"జైలర్ రూమ్ లో ములాఖాత్ ఏర్పాటు చేయకూడదు. మీ భర్త రాజకీయాల్లో చేరక ముందు నుంచీ, స్టూడెంటు రోజుల్లోనూ నాకు తెలుసు. చాలా మంచివాడు. ఆ గౌరవంతోనే మీరు వీడిని నా గదిలో కలుసుకోవటానికి ఏర్పాటు చేసాను. ఇక మీ అనుమానం గురించి వస్తే... వీడు మీ భర్తని చంపటానికి ఏమీ పెద్ద కారణమంటూ ఏమీ ఉండనక్కర్లేదమ్మా. కాలేజీ రోజుల నుంచే వీడు పెద్ద రౌడీ. మీ భర్త రోజు రోజుకీ ఎదగటం చూసి ఈర్ష్య పడి ఉంటాడు.

హత్య చేయాటానికి ఇలాంటి వాళ్లకి ఆ మాత్రం కారణం చాలు. వీడు చేసిన పాపానికి మరో పదేళ్లు ఈ జైల్లోనే ఉండాలి. అయినా వీళ్ళు మారరు. వెళ్లిరండి" అన్నాడు.

ఆమె తల ఎత్తి సలీం వైపు చూసి అక్కడి నుంచి కదిలింది. పోలీసు సలీంని తిరిగి సెల్ కి తీసుకెళ్ళాడు.

++ ++ ++

పై సంఘటన జరిగి పది రోజులు అయి ఉంటుంది. సలీం తన సెల్ లో ఉండగా సెంట్రీ వచ్చి ఎవరో ములాఖాత్ కి వచ్చారని చెప్పాడు. సలీం ఆశ్చర్యపోయాడు. వచ్చింది ఎవరో అర్థం కాలేదు. ఆ అయోమయ స్థితిలోనే హాల్లోకి వచ్చిన అతను అక్కడున్న స్త్రీని చూసి మరింత ఆశ్చర్యపోయాడు. ఆమె శ్రీకర్ భార్య.

అతన్ని చూసి లేచి నిలబడి "క్షమించండి. మీ అనుమతి తీసుకోకుండా వచ్చాను" అంది.

సాధారణంగా జైల్లో ఖైదీని కలుసుకోవాలంటే అప్లికేషన్ పెట్టాలి. కలుసుకోవటానికి ఆ ఖైదీ ఒప్పుకోవాలి. అయితే ఇదంతా పేపర్ మీద రూల్ మాత్రమే. ప్రాక్టికల్ గా ఇలా జరగదు.

ఆమె చేతిలో గిన్నె కిటికీ గుండా అతడికి అందిస్తూ, "పండుగ రోజులు కదా. మీ కోసం హలీం తీసుకొచ్చాను" అంది.

అతడు భరించలేనంత విస్మయంతో ఆమె వైపు చూసి, "మీ భర్తని ఎందుకు చంపాను అన్న కారణం తెలుసుకోవడానికి ఆ రోజు వచ్చిన మీరు, ఈ రోజు నాకోసం హలీం తీసుకొచ్చారా?" అడిగాడు.

"మీరు నా భర్తను చంపలేదు".

అతడు తన చెవుల్ని నమ్మలేనట్టు ఆమెవైపు చూశాడు

"పది రోజుల క్రితం నేను అడిగినప్పుడు మీరు అదే చెప్పారు కదా. అలా చెపుతున్నప్పుడు మీ కంఠంలో నిజాయితీ కనబడింది. దాన్ని నేను నమ్ముతున్నాను. నేను ఈ రోజు వచ్చింది 'నా భర్తని ఎవరు చంపారు?' అని అడగటానికి కాదు. 'ఎందుకు చంపారు?' అని తెలుసుకోవటానికి. నాకు తెలిసినంతలో నా భర్త అందరికీ ఉపయోగపడే మనిషి. ఎవరికీ హాని చేసే వ్యక్తి కాదు. అలాంటి వారిని ఎందుకు చెప్పారు? ఆర్థికపరమైన ఇబ్బందులు... వయసు వస్తున్న ఇద్దరు ఆడపిల్లలు... ఒంటరి తనం... ఇదంతా ఎవరు చూసుకుంటారు?" ఆమె బాధగా అన్నది

"శ్రీకర్ హత్య మిమ్మల్ని ఎంత బాధ పెట్టిందో అంతకన్నా ఎక్కువ హాని నాకు చేసింది".

ఆమె ఆశ్చర్యంగా "నా భర్త మరణం నాకన్నా మిమ్మల్ని మీకు ఎక్కువ హాని చేసిందా?" అడిగింది

"అవును."

"ఎలా?"

"అల్లా మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నాకూ, ఈ హత్యకూ ఏ సంబంధమూ లేదు. నిజానికి హత్య జరిగిన రోజు నేనసలు ఈ ఊర్లోనే లేను. ఒకవేళ ఆ హత్య నేను చేసి ఉంటే 'నేనే చేశా'నని చెప్పటం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఏమీ లేదు. ఎలాగూ శిక్ష పడిపోయింది. జీవితంలో అత్యంత విలువైన సమయం కోల్పోయాను. హంతకుడు అనే ముద్ర పడింది. ఉద్యోగం పోయింది." ఒక క్షణం ఆగాడు. "... నేను జైలుకి వచ్చాక నా భార్య అనాథ అయింది. కొంతకాలం ఫ్యాక్టరీలో కూలిగా పని చేసిందట. ఆరోగ్యం పాడైంది. దాంతో ఆ ఉద్యోగం కూడా పోయింది. గుడిసెలో చూసుకునే దిక్కు లేక... పది రోజుల క్రితమే..." అతడు నెమ్మదిగా పూర్తి చేశాడు "ఆకలితో చనిపోయింది"

తనలో తనే గొణుక్కుంటున్నట్టు 'ఐ యాం సారీ' అన్నది.

"చనిపోయిన రెండు రోజుల వరకూ ఆ పాకలో శవం ఉన్నదన్న విషయం బయట వారికి తెలియ లేదు. వాసన రావటంతో..." కంఠంలో ఏదో అడ్డు పడ్డట్టు, భార్య తాలూకు స్మృతులతో అతడు చాలా సేపు మౌనంగా ఉండిపోయాడు.

భర్త జైల్లో ఉంటే, బయట భార్య ఆకలితో అనాథగా చనిపోవటం ఎంత వ్యధాభరితంగా ఉంటుందో ఆమె ఊహించగలదు. అందుకే అతడిని మరేమీ ప్రశ్నించకుండా సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

తనని కలుసుకోవడానికి ఆమె మళ్ళీ వస్తుందో లేదో తెలీదు కానీ, కనీసం ఆమె దగ్గర అయినా తన నిర్దోషత్వం నిరూపించుకోవాలని చిన్న ఆశ..!

ఆ రాత్రి అతడు ఆమెకు ఒక సుదీర్ఘమైన ఉత్తరం రాశాడు.

"మా ఊళ్లో గుడి, మసీదు పక్క పక్క నే ఉండేవి. ఇరు మతాల వాళ్ళూ తమ తమ ప్రార్ధనా స్థలాల నుంచి బయటకు రాగానే ఆప్యాయంగా పలకరించుకోవటం, పండుగ రోజుల్లో కౌగిలించుకొని 'ఈద్ ముబారక్' చెప్పుకోవటం, ఇప్పటికీ నా కళ్ళకి కట్టినట్టే ఉన్నాయి. మా తాతగారి పేరు గఫర్ ఖాన్. నేను ఆయన దగ్గరే పెరిగాను. మా తాతగారు నన్ను ప్రతిరోజు నమాజ్ కి తీసుకెళ్లేవారు. ఆయన ప్రవచనాలు వల్ల నాకు మతం మీద నమ్మకం పెరిగింది. వయసు వచ్చే కొద్దీ ఆ సిద్ధాంతాలు నా మీద ప్రభావం చూపసాగాయి ఎవరికీ భయపడేవాడిని కాను. స్కూల్లోనూ, బయటా ఏ అన్యాయం జరిగినా ఎదిరించే మనస్తత్వం అలవడింది. కాలేజీకి వచ్చేసరికి అది మరింత బలపడింది. బహుశా నేటి నా ఈ స్థితికి కారణం అదేనేమో.

మీ భర్తా, నేనూ కాలేజీలో క్లాస్‌మేట్స్. మతాలు వేరైనా అభిరుచులు ఒకటే అవటంతో స్నేహంగా ఉండేవాళ్ళం. ఒకరికొకరం ఎంతో గౌరవం ఇచ్చుకునేవాళ్ళం. ఆ సమయంలో ఒకసారి కాలేజీలో గొడవలు జరిగాయి. విద్యార్థులు రెండుగా విడిపోయారు. ఒక వర్గానికి మీ భర్త శ్రీకర్ నాయకత్వం వహించాడు. అతడికి ప్రత్యర్థిగా అవతలి వర్గంలో హేమంత్ అనే కుర్రవాడు నాయకుడు. నేను తటస్థంగా ఉండిపోయాను. రెండు రాజకీయ పార్టీల దన్ను రెండు వర్గాలకీ విడివిడిగా ఏర్పడింది.

ఈ మధ్య కాలంలో హేమంత్, డబ్బు వల్ల వచ్చిన దర్పంతో ముంతాజ్ బేగం అనే మా అమ్మాయి దగ్గర చేయగలిగినంత అనర్థం చేశాడు. వెళ్లి వాడిని కొట్టాను. ఆరోజుల్లో నా ఆవేశం అలా ఉండేది. హేమంత్ నా మీద కక్ష పెంచుకున్నాడు.

కాలేజి ఎలెక్షన్స్ పూర్తి అయ్యాయి. డబ్బు లేకపోయినా మీ ఆయన కేవలం తన మంచితనంతో నెగ్గాడు.

మా ఇద్దరి గ్రాడ్యుయేషన్ పూర్తయింది. నేను పై చదువులకి వెళ్లాను.

మీ భర్త రాజకీయాల్లో చేరి ఎం.ఎల్.ఏ. ఎన్నికల్లో నిలబడే సమయానికి నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నాను. అప్పటికి నాలో మొండితనం మరింత పెరిగింది. ఎక్కడ ఉద్యమం ఉన్నా ముందుండి నడిపించేవాడిని. ఆ క్రమంలో ఒక లంచగొండి రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా పోరాడవలసి వచ్చింది. నా పేరు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. "రౌడీ షీటర్" అని ముద్ర వేశారు.

ఎన్నికల హడావిడి మొదలయింది. అధికార పక్షంలో ఇద్దరు వ్యక్తులు ఎం.ఎల్.ఏ టికెట్ ఆశించారు. అందులో మీ ఆయన ఒకరు. మరో వ్యక్తి హేమంత్. పార్టీ మీ భర్తని ఎంపిక చేసింది. ఆయన నామినేషన్ వేశాడు. నన్ను అడిగితే 'నీకు తప్ప ఇంకెవరికి చేస్తాను' అని వాగ్దానం చేసాను.

మా ఊళ్ళో ముస్లింల సంఖ్య బాగానే ఉండేది. ఓట్ల రాజకీయాలు మొదలయ్యాయి. అప్పుడే నాకొక విషయం తెలిసింది. మా మతానికి సంబంధించిన ఒక ప్రముఖ వ్యక్తి మీ ఆయనకు ఎదురుగా ఎన్నికల్లో నిలబడుతున్నాడని..! ఇబ్బందికరమైన స్థితే. కానీ, నేను మీ ఆయనకి మాటిచ్చాను కాబట్టి మావారి నుంచి దూరంగా వచ్చి, మీ ఆయన తరపున ప్రచారం చేయ సాగాను.

ఇక్కడే ఎవరూ ఊహించని సంఘటన జరిగింది. నామినేషన్ ఆఖరి రోజు దగ్గర్లో ఉందనగా, గుడి జంక్షన్ దగ్గర ఒక ముస్లిం యువకుడిని నలుగురు కొట్టారు. పెద్ద గొడవ జరిగింది. కొంతమంది కుర్రాళ్ళతో పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి గొడవ చేశాను. రౌడి షీటర్ ని కాబట్టి నా మాట ఎవరూ వినలేదు. మరుసటిరోజు గుడి దగ్గర ఆవుని చంపి పడేశారు. దాంతో షాపులు తగలబెట్టారు. ముస్లిం అభ్యర్థికి వ్యతిరేకంగా ధర్నాలు మొదలయ్యాయి. పై సంఘటనతో మీ ఆయన గెలవటం నూరు శాతం ఖరారైపోయింది.

ఇదంతా రాజకీయమా, అరాచకీయమా అన్నది నాకు అర్థం కాలేదు.

మీ ఆయన ఇలాంటి పనులు చేయడనీ, చేయించడనీ నాకు తెలుసు. మరి ఎవరు చేసారు? ఎందుకు చేసారు?

అప్పుడే చూచాయిగా నాకో విషయం తెలిసింది.

అలా కొట్టించిందీ, మతకలహాలు రేపిందీ హేమంత్..! పార్టీ తరపున ఎం.ఎల్.ఏ. సీట్ ఆశించిన హేమంత్..!!

అతడి ప్లాన్ నాకు అప్పట్లో అర్థం కాలేదు.

నామినేషన్ గడువుకి ఇంకా రెండు రోజులు ఉందనగానే మీ ఆయన్ని హత్య చేశారు.

అనుకున్నట్టే ఆ సీటు హేమంత్ కి వచ్చింది. మత ప్రాతిపదిక మీద అప్పటికే ఊరు రెండుగా విడిపోయింది. అతడి విజయం నల్లేరు నడకలా సాగింది.

అప్పుడు అర్థం అయింది అతడి ప్లాన్. ఒక దెబ్బకి రెండు పక్షులు.

మాట ద్వేషాలు రెచ్చగొట్టి, ఆ తరువాత మీ ఆయన్ని చంపేస్తే, సీటు తనకి దక్కుతుందనీ, సానుభూతి ఓట్లన్నీ తనకే పడతాయనీ హేమంత్ ప్లాన్ వేసాడు.

ఇదంతా జరుగుతున్న సమయానికి నేను ఈ ఊళ్ళోనే లేను. అంతకు ముందు నాలుగు రోజుల క్రితమే నాకు ఉద్యోగం వచ్చినట్టు తెలిసి, సర్టిఫికెట్ల కోసం పట్నం వెళ్లాను. అక్కడ టీ.వీ. చూస్తూ ఉండగా "ఎం.ఎల్.ఏ. అభ్యర్థిని ఎవరో ముసుగు వ్యక్తి చంపేశాడు" అని స్క్రోలింగ్ కనబడింది. మీ ఆయన నాకు అంత ఆప్త మిత్రుడు కాకపోయినా, ఆ వార్త వల్ల మనసు వికలమై వెనక్కి వచ్చేసాను కూడా.

మరుసటి రోజు పోలీసులు వచ్చి నన్ను అరెస్ట్ చేశారు. ఎందుకు చేశారో కూడా నాకు తెలీదు. ఆ తరువాత విషయం అర్థమయింది. నేను మీ ఆయన పార్టీలో ఒక కోవర్టుగా చేరాననీ నా మతమూ, నా ఉద్దేశ్యాలూ వేరనీ, మీ ఆయన గెలవకుండా ఉండటం కోసం ఆయన్ని చంపేశాననీ ఒక వాదన లేవదీశారు. ఈ లోపులో హేమంత్ ఎం.ఎల్.ఏ. అయ్యాడు. నాకు పది సంవత్సరాలు శిక్ష పడింది.

ఇదీ జరిగింది. నేను చెప్పింది మా అమ్మతో సహా ఎవరూ నమ్మలేదు. నేను జైలుకి వెళ్ళిన కొన్నిరోజులకి ఆమె మరణించింది. ఇదిగో... ఇప్పుడు నా భార్య కూడా నన్ను వదిలి వెళ్ళిపోయింది. కనీసం మీరైనా నేను చెప్పింది నమ్ముతారని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. శ్రీకర్ ఎప్పటికీ నా స్నేహితుడే. మతాలు వేరైనా మా ఇద్దరి మధ్యా మమతలు అలాగే ఉంటాయి – సలీం”

\- అంటూ ఉత్తరం పూర్తి చేశాడు.

++ ++ ++

మెలోడ్రామా ఎక్కడో పుస్తకాల్లో ఉంటుందని అనుకుంటాం కానీ, మన జీవితాల్లో ఉన్నంత డ్రామా మరి ఎక్కడా ఉండదు.

ఏదో చిన్న కేసులో దొరికిన దొంగ... పోలీస్ ఇంటరాగేషన్లో... తనూ మరో స్నేహితుడూ కలిసి మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసేవాళ్ళమనీ, అతడు కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేసాడని చెప్పాడు. మరింత తగిలిస్తే, శ్రీకర్ని హత్య చేసింది కూడా అతడే అని వెల్లడి అయింది. మరిన్ని రుజువులు దొరికాయి. ఎమ్మెల్యే హేమంత్ మీద కేసు రిజిస్టర్ అయింది.

అప్పుడు ఆమె అతడిని కలుసుకుంది.

“నిజం నిప్పులాంటిది అంటారు. మీరు తప్పకుండా ఈ కేసు నుంచి బయటకు వస్తారు అంతే కాదు. చేయని నేరానికి ఇన్నాళ్లు శిక్ష అనుభవించేలా చేసినందుకు కోర్టు మీకు క్షమాపణ చెప్పుకున్నా ఆశ్చర్యం లేదు” అన్నదామె సంతోషం నిండిన కంఠంతో.

అయితే అతడిలో అటువంటి సంతోషం ఏమీ కనబడలేదు. “నాకంటూ బయటి ప్రపంచంలో ఎవరూ లేరు. జైల్లో ఉన్నా, బయటికి వచ్చినా పెద్ద తేడా ఏమీ లేదు” అన్నాడు.

“ఎందుకంత నెగిటివ్ గా ఆలోచిస్తున్నారు?”

అతడు ఆమె వైపు అభావంగా చూసి “ఇందులో నెగిటివ్ ఏముంది? అంతా వాస్తవమే కదా” అన్నాడు నిర్లిప్తంగా.

“నాలుగు గోడల మధ్య కాకుండా... బయటి ప్రపంచంలోకి వస్తే, మతద్వేష రహిత సమాజం పట్ల మీరు నమ్మిన సిద్ధాంతాలను సమాజానికి ప్రచారం చెయ్యవచ్చు”

ఆ మాటలకి అతడు ఆమె వైపు ఆశ్చర్యంగా చూసాడు.

ఆమె కొనసాగించింది. “... *కొండ శిఖరం మీద చీకటిలో ఉన్నప్పుడు, తిమిరాన్ని తిడుతూ కూర్చుంటే జీవితాంతం అక్కడే ఉండిపోతామట. అలా కూర్చోవడం కంటే, అడుగు ముందుకు వేస్తే కింద మెట్టు తగలవచ్చు. లేదా గాలిలో ఎగరడం తెలియవచ్చు*’ అని ఎక్కడో చదివాను. నాది శ్రీకర్ ది ప్రేమ వివాహం. మా వాళ్ళందర్నీ వదిలి వెళ్లి పెళ్లి చేసుకున్నాను. నా కళ్ళ ముందే అతడు అంచెలంచెలుగా ఎదిగి గొప్ప రాజకీయ నాయకుడు అయ్యాడు. అతడు మరణించేసరికి మా కలల భవంతి గాజుబొమ్మలా కూలిపోయింది. మరణించే సమయానికి నాకు నాలుగో నెల. ఎన్నో అవమానాలు భరించాను. ‘విధవరాలి కూతురికి బారసాల కూడానా’ అన్నారు. దగ్గరికి తీసుకునే వాళ్లు కూడా లేరు. అర్థరాత్రి నా పెద్ద కూతురు లేచి ‘నాన్న కావాలి’ అంటూ ఏడ్చేది.

శ్రీకర్ ఏమీ సంపాదించ లేదు. దాంతో ఆర్థిక ఇబ్బందులు. టీచర్ గా చేరాను. ఇద్దర్ని పెంచి పెద్ద చేస్తూ ఉన్నాను. ఒకటే గమ్యం. తండ్రి లేని లోటు తెలియకుండా పిల్లల్ని పెంచాలి..! పాజిటివ్ థింకింగ్ అంటే ఏమిటని మీరన్నారే. ఇంతకన్నా ఏం కావాలి?"

++ ++ ++

జైలు నుంచి గేటు దాటి సువిశాల ప్రపంచంలోకి అడుగు పెట్టాడు అతడు. ఇద్దరు కూతుళ్లతో ఆమె బయట నిలబడి వుంది.

చిన్న కూతురి చేయి పట్టుకున్నాడు. నలుగురూ ముందుకి సాగిపోయారు.

సూర్యుడు పడమటి వైపు క్రుంగి పోతూ ఉన్నాడు.

మతాన్ని రాజకీయం కలుషితం చేసిందా, రాజకీయాన్ని మతం కలుషితం చేసిందా అన్న అయోమయంతో ఉన్నట్టూ ప్రపంచం అనే జైలు మీద చీకటి చాయలు కమ్ముకోసాగాయి.

వారు జైలు నుంచి దూరంగా నడుస్తున్నారు.

★★★